క్లుప్తంగా

'ఉక్కు కార్మికులపై విద్యుత్ భారం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికుల క్వార్టర్ల విద్యుత్ చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించాలని స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా యాజమాన్యం కార్మికులపై అదనపు భారం మోపిందన్నారు. 16 రెట్లు విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై రీజనల్ లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, నరేష్‌కుమార్, కె.రాజబాబు, బి.జయ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- అప్పన్నకు గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరపూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఆర్థిక నివేదికల్లో పారదర్శకత తప్పనిసరి


ప్రసంగిస్తున్న ప్రముఖ సీఏ కమల్ గార్గ్

ఉక్కునగరం: ఆర్థిక నివేదికలు సిద్ధం చేసేటప్పుడు పారదర్శకత అవసరమని ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐకాయ్)లో అక్కౌంటింగ్ స్టాండర్డ్స్ బోర్డ్ (ఏఎస్‌బీ), ఫైనాన్సియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డ్ (ఎఫ్ఆర్ఆర్‌బీ) సభ్యుడు, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ కమల్ గార్గ్ అన్నారు. ×ఫైనాన్సియల్ స్టేట్‌మెంట్లలో సాధారణ తప్పులు× అంశంపై ఉక్కునగరం స్టడీ సర్కిల్ ఆఫ్ ఐకాయ్, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు ప్రధాన సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అకౌంటింగ్ విధానాలు, అంచనాలు, సంభావ్య నష్టాలను బహిర్గతం చేయడం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కమల్ గార్గ్‌కు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) సీహెచ్.వి.ఆర్.జి.కె. గణేశ్ జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఐకాయ్ దక్షిణ భారత ప్రాంతీయ మండలి సభ్యులు, గ్రంథి అండ్ అసోసియేట్స్ సీనియర్ భాగస్వామి నరేష్ చంద్ర గెల్లి, స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ సీజీఎం వి.శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతో లాభాల బాట


దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, ఉద్యోగులు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి ఎన్ఎండీసీ సహకారం అందిస్తే కేంద్ర ప్రభుత్వం ఊహించని లాభాలను తెచ్చి పెడుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. లేదా సొంత గనులు కేటాయిస్తే తమ సత్తా చూపిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పోరాట, పరిరక్షణ కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షా శిబిరంలో 1199వ రోజు, శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తన కుయుక్తులు మానుకొని ప్రైవేటీకరణను ఆపకపోతే రాష్ట్ర ప్రజల తిరుగుబాటు తప్పదన్నారు. పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య రెట్టింపు అవుతోందని, ఈ సమయంలో లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని అన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోతే దేశంలో తిరుగుబాటు తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి రమణ



కాగిత కళాకృతులతో విద్యార్థులు

పెదగంట్యాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు పదును పెట్టేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో వివిధ కళాకృతులను తయారు చేయించారు. శనివారం కథలు పుస్తకాలు చదివించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి మేరకు వారికి శిక్షణ ఇస్తున్నామని, వారు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారని చెప్పారు.

చిన్నారులకు చేతిరాత, మ్యూజికల్ చైర్ పోటీలు

గాజువాక : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం చేతిరాత పరీక్ష, మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో చిన్నారులకు తొలుత కథలు చదివించి, ఆ కథలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం చేతిరాత పరీక్ష నిర్వహించారు. మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కె.దేవి పాల్గొన్నారు.

యోగా జడ్జీల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చేనెల 7 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జడ్జీల శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. లెవెల్-1 శిక్షణలో పాల్గొనబోయే వారు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని, కనీస వయసు 21 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. జడ్జీగా ఒక జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని లేదా యోగా, యోగాసన డిప్లమో కోర్సు పూర్తి చేసి ఉండాలని తెలియజేశారు. లెవెల్-2 జడ్జి శిక్షణ తరగతుల్లో పాల్గొనదలచిన వారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, కనీస వయసు 25 సంవత్సరాలు ఉండాలని తెలిపారు. వైఏఏపీ లేదా ఎస్ఎస్‌వైఎఫ్ లెవెల్-1 సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ఉండాలని తెలియజేశారు. అర్హత గలవారు ఈ నెల 28వ తేదీ లోగా తనను సంప్రదిస్తే జిల్లా నుంచి జాబితాను పంపిస్తామని పేర్కొన్నారు.

కిశోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన


ప్రదర్శనలో పాల్గొన్న సూపర్‌వైజర్ సుజాత తదితరులు


ప్రియదర్శిని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్లకార్డులతో ప్రదర్శన

పెదగంట్యాడ: కిశోర్ బాలికలు ప్రోటీన్, ఐరన్‌తో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. బాలికలు ఋతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై బాలచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో నెల్లిముక్కు, పెదగంట్యాడ కేంద్రాలకు సంబంధించి శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూఢనమ్మకాలతో అనర్థాలు వస్తాయన్నారు. నెలసరి సమయంలో తగిన పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యపరమైన సమస్యలను తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వేణుశ్రీ, వరలక్ష్మి, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని కాలనీ కేంద్రంలో..

కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి సూచించారు. 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు శనివారం మానసిక మహోత్సవం పేరుతో ఋతుక్రమ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ నాప్‌కిన్స్ వాడే విధానం వివరించారు.

27న ఎంవీఆర్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక : దివీస్ లేబరేటరీస్‌లో ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రంటీస్ పోస్టుల భర్తీకి ఈ నెల 27న స్థానిక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్ పోస్టుకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ, బీటెక్ (కెమికల్) విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ అప్రంటీస్ పోస్టుకు ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), అనలెటికల్ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ (క్యూఏ అండ్ ఆర్ఏ) విద్యార్థులు అర్హులని తెలియజేశారు. 2020-23 బ్యాచ్ డిగ్రీ ఉత్తీర్ణులతో పాటు 2024లో చదువుతున్న విద్యార్థులు కూడా ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో కాలేజీ క్యాంపస్‌కు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని కోరారు.

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అతిథులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలో కొలువుదీరిన వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐడీ అధికారి సునీత, అడ్వకేట్స్ డి.మహేష్‌రెడ్డి, పి.ధనుంజయరావు హాజరయ్యారు. వారు ముందుగా స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, అప్పలరెడ్డి, రామారావు, సత్యవతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో బంగారుమాంబ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవతలైన బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ వార్ల నవరాత్రి పండగ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి నాతయ్యపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన కర్రసాములో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బంగారుమాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి ఊరేగింపును వైభవంగా జరపనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

తిరుమల బాలాజీకి విశేష పూజలు


విశేష అలంకరణలో స్వామి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం విశేష పూజలు కనులపండువగా జరిగాయి. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ జరిపించారు. శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలేశునికి విశేష పుష్పాలు, మామిడి ఫలాలతో అలంకరణ చేసి, అర్చించారు. తిరుమలేశునికి సహస్ర నామార్చన, నక్షత్రహారతులు నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకునేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


సంతోష్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక శ్రీనివాస నగర్‌కు చెందిన పి.సంతోష్ (42) ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నారు. సంతోష్‌కు భార్య సౌమ్య, బాబు ఉన్నారు. సంతోష్ కొద్ది కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. సంతోష్ భార్య సౌమ్య కొద్ది రోజుల క్రితం మధురవాడలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లారు. శనివారం భర్త సంతోష్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పనిమనిషికి ఫోన్ చేసి, ఇంటికి వెళ్లి సంతోష్‌తో మాట్లాడించమని చెప్పారు. పనిమనిషి అక్కడికి వెళ్లే సరికే సంతోష్ ఇంట్లోని ఓ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్నారు. వెంటనే ఇరుగుపొరుగు వారికి తెలియజేసి, సౌమ్యకు ఫోన్‌లో విషయం తెలియజేయడంతో ఆమె వెంటనే ఇంటికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు వివరాలను సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు గాజువాక పోలీసులు తెలిపారు.